క్లుప్తంగా

తలకోన సిద్ధేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

భాకరాపేట: తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామున స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవలో మేల్కొల్పి పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఆలయంలోని ఉపాలయాల్లో వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహ పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వలసారెడ్డి శిద్దరామిరెడ్డి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు.

బొప్పరాజుపల్లిలో నాకాబందీ


ఆటో పత్రాలను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

రామచంద్రాపురం: మండలంలోని బొప్పరాజుపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో సీఐ రామయ్య ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని ప్రతి ఇంటినీ, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో నాకాబందీ, పోలీసు కవాతు చేపడుతున్నట్లు తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, హింసాత్మక దాడులను ప్రేరేపించేలా సందేశాలు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 7 బైక్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. అనంతరం అనుప్పల్లి, నూతిగుంటపల్లి, నెమళ్లగుంటపల్లి, బీరమాకుల కండ్రిగ గ్రామాల్లో పోలీసు కవాతు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చిరంజీవి, అనిత, పోలీసు సిబ్బంది సురేష్, ధనుంజయులు, యోబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

తిరుపతి సిటీ: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలో బారికేడింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, కంట్రోల్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయనతో పాటు రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి, ప్రొబెషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు అధికారులు ఉన్నారు.

మద్యంబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపిన కేసులో తిమ్మినాయుడుపాళెంకు చెందిన బి.నాగరాజుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 16 మందిపై తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

టీడీపీ కార్యకర్తలకు రిమాండ్, బెయిల్

తిరుపతి లీగల్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడికి సంబంధించిన వాహనాన్ని దహనం చేసిన కేసులో ఆరుగురు టీడీపీ కార్యకర్తలను ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు సోమవారం రాత్రి తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నివాసం వద్ద హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆరుగురికి జూన్ మూడో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. అయితే వారిపై నమోదైన కేసు బెయిలబుల్ సెక్షన్ల కింద కావడంతో న్యాయమూర్తి వారికి రూ.10 వేలు, ఇద్దరు జామీనుదారుల పూచీకత్తుపై విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పాకాల ధర్మరాజుల గుడివీధికి చెందిన రాకేష్ అలియాస్ వెంకీ, చంద్రగిరి మండలం మండపంపల్లికి చెందిన జి.గురవయ్య, తిరుపతి తాటితోపు, వెంకటపతి నగర్‌కు చెందిన సాధన పవన్‌కుమార్ అలియాస్ పాండు, పాకాల మండలం ఉట్లవారిపల్లికి చెందిన పి.కిరణ్, పాకాల బీడీ వీధికి చెందిన ఆర్.మోహన్ బాబు, రామచంద్రాపురం మండలం కమ్మకండ్రిగకు చెందిన సింగ్ హరీష్ కుమార్ ఉన్నారు. ఈ కేసులో మరికొంతమంది నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉంది. వాహనాలను తగులబెట్టి, యూనివర్సిటీ సమీపంలో విధ్వంసం సృష్టించిన టీడీపీ కార్యకర్తలపై బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంపై పలువురు న్యాయవాదులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల తీరు చాలా బాధాకరమని న్యాయవాదులు అంటున్నారు.

అన్నమయ్య కీర్తనలు.. ఆధ్యాత్మిక తరంగాలు

- ఆచార్య భూమన కుసుమ కుమారి


మాట్లాడుతున్న ఆచార్య భూమన కుసుమ కుమారి

తిరుపతి కల్చరల్: ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తి భావాన్ని చైతన్య పరిచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామి వారిని కేంద్రంగా చేసుకుని అన్నమయ్య సంకీర్తనలు రచించి వ్యాప్తి చేశారని అనంతపురం శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య భూమన కుసుమకుమారి తెలిపారు. అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న సాహితీ సదస్సులు సోమవారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆమె అన్నమయ్య – తాత్వికత అనే అంశంపై ఉపన్యసించారు. వైరాగ్యం, విరక్తి, కోర్కెలు లేకపోవడం వంటివాటిని ప్రబోధిస్తూ ప్రజలను ఆధ్యాత్మికత, మోక్షమార్గంలో నడిపేందుకు అన్నమయ్య సంకీర్తనలను రచించారని తెలిపారు. వేదాంతాన్ని భక్తి అనే రసగుళిక ద్వారా సామాన్య ప్రజలకు చేరువ చేసిన మహనీయుడు అన్నమయ్య అని తెలిపారు. నామ సంకీర్తన, నామ జపంతో జాతి, కుల, మతాలకు అతీతంగా భగవంతుని చేరవచ్చని తెలిపారు. శ్రీవారిని సంకీర్తన ద్వారా సామాన్యులకు చేరువ చేసేందుకు అన్నమయ్య కృషి చేసినట్లు వివరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ శ్రీనివాసుడు ఎంతటి మహిమగల దేవుడో అన్నమయ్య అంతటి విశిష్టమైన భక్తుడన్నారు. భగవంతుని చేరేందుకు భక్తి సులభమైన మార్గమని, హరిభక్తులకు ఎలాంటి కొరత ఉండదని ప్రబోధించాడని తెలిపారు. శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి అన్నమయ్య కీర్తనలు– సందేశం అనే అంశంపై మాట్లాడారు. అన్నమయ్య వాగ్గేయకారులకు, కవులకు, భాషా సందేశం, కీర్తనలు, కీర్తన అంశాల విధాన సందేశం, తాత్విక, సంగీత సందేశం ఇచ్చినట్లు వివరించారు. ప్రముఖ సాహితీ వేత్త రసరాజు చక్రవర్తులు, రాజుల ఆస్థానాలలో పరిమళిస్తున్న పద్యానికి, సంకీర్తనల పరిమళాన్ని అందించిన మహనీయుడు అన్నమయ్య అని తెలిపారు. అష్టాక్షరి మంత్రంలోని 36 అక్షరాలకు ఒక్కొక్క అక్షరానికి పదివేల కీర్తనలు చొప్పున 32 వేల కీర్తనలు జాతికి అందించిన గొప్ప వాగ్గేయకారుడన్నారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తన్మయత్వం.. సంకీర్తనాగానం...


గాత్ర కచేరీ చేస్తున్న జాగర్ల మూడి మాధవికృష్ణ బృందం


భక్తి సంకీర్తనలను గానం చేస్తున్న చైతన్య శృతిక


హరికథా గానం చేస్తున్న నాగమణి బృందం

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసులు ఆలపించిన భక్తి సంకీర్తనాలాపన ఆద్యంతం భక్తి భవాన్ని పంచుతూ ప్రేక్షకులను తన్మయత్వ పరిచింది. అన్నమాచార్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో అన్నమయ్య సంకీర్తనల కచేరీ నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖపట్నంకు చెందిన చైతన్య, చిన్నారి శృతిక బృందం ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. గోవిందాశ్రిత గోకుల బృందా.., వినదగ వారికి ఇహ పరమిదిగో.., అల వేంకటాద్రి మీద వరదైవం.. వంటి కీర్తనలను సుమధురంగా గానం చేసి సభికులను మైమరిపించారు. అనంతరం కేరళకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు జాగర్లమూడి మాధవీకృష్ణ బృందం గాత్ర కచేరీ చేపట్టారు. విశ్వరూపం ఇదిగో విష్ణు రూపం ఇదిగో.., మంగాబుధి హనుమంత.. వంటి సంకీర్తనలను ఆలపించి ప్రేక్షకులను అలరింపజేశారు. అంతకుముందు ఉదయం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నాగమణి బృందం ఆలపించిన హరికథాగానం సభికులను ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల కళాకారులను శ్రీవారి ప్రసాదాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ మార్కొండయ్య నాయుడు

రామచంద్రాపురం: విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. సోమవారం మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే వర్కర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగి జావ, ఉడికించిన గుడ్డు తీసుకోవడం ద్వారా ఎముకల బలాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. సమతుల్య ఆహారం అందించడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. ప్రతి పాఠశాలలో రోజువారీ మెనూ తప్పక పాటించాలని తద్వారా విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు అందుతాయన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ రాజు మధ్యాహ్న భోజనం వర్కర్లకు పౌష్టికవంతమైన వంట తయారీలో మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలయ్య, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, మధ్యాహ్న భోజనం వర్కర్లు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: తిరుపతి జిల్లాలో పూర్తిస్థాయిలో మాతా శిశు మరణాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో మాతా శిశు మరణాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎదురవుతున్న లోటుపాట్లు పై అధికారుల నుంచి ఆయన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను 100 శాతం అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. రాబోవు రోజుల్లో ఒక్క కేసు కూడా ఉండకూడదని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు వీరేశలింగం


మాట్లాడుతున్న ఈతరం కవితా వేదిక వ్యవస్థాపకుడు తోట వెంకటేశ్వర్లు

తిరుపతి కల్చరల్: గొప్ప సంఘసంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సాహితీరంగంపై విశేష కృషి చేసి అనేక రచనలతో సమాజ శ్రేయస్సు కోసం శ్రమించిన నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులని ఈతరం కవితా వేదిక వ్యవస్థాపకుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్యకై ఉద్యమించడంతో పాటు అనేక పాఠశాలలతో విద్యాభివృద్ధి కృషి చేశారన్నారు. వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఆనాటి సమాజంలో బాల్య వివాహాలను నియంత్రించారని తెలిపారు. కార్యక్రమంలో వేమన విజ్ఞా న కేంద్రం ప్రతినిధులు టింకాలయ దామోదరం, నడ్డి నారాయణ, జేవీవీ నాయకులు యుగంధర్‌బాబు, గురునాథం, మునిలక్ష్మి, సోమేశ్వర్, లక్ష్మీబాలాజీ చౌదరి, సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకటరమణ, రవి పాల్గొన్నారు.

రంగస్థలం ఆధ్వర్యంలో..

సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులుకు చిగోరా ఆధ్యాత్మిక సేవాకేంద్రం, రాయలసీమ రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో కందుకూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆధ్యాత్మిక సేవాకేంద్రం ప్రతినిధి హనుమంతరావు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు వీరేశలింగం అని కొనియాడారు. కార్యక్రమంలో కేఎస్ రాజా, సీఆర్‌కే శేషగిరిరావు, సురేష్‌బాబు, బాలకృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 975 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలకు 975 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 15,335 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 798 మంది, మధ్యాహ్నం జరిగిన సెకండియర్ జనరల్, ఒకేషనల్‌లో కలిపి 2898 మంది హాజరవ్వాల్సి ఉండగా 177 మంది పరీక్ష రాయలేదు. పిచ్చాటూరు ప్రభుత్వ జూని యర్ కళాశాల సెంటర్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఐదుగురిని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రవి డీబార్ చేశారన్నారు. మంగళవారం ఉదయం ఇంటర్ ప్రథమ, మధ్యాహ్నం సెకండియర్ విద్యార్థులకు మ్యాథ్స్–1బీ, 2బీ, జువాలజీ, హిస్టరీ, సబ్జెక్టుల పరీక్షలు జరుగుతాయన్నారు.

వైభవంగా శ్రీవారి వసంతోత్సవం


దేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు


శ్రీదేవి, భూదేవి సమేత తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని వసంతమండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శ్రీ భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్‌సేవ, అనంతరం సాయంత్రం 6 నుంచి స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు స్వర్ణ రథోత్సవం

మంగళవారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారి స్వర్ణ రథోత్సవం కనుల పండువగా జరుగనుంది. వసంతోత్సవాల కారణంగా ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు శ్రీ బాలాజి రంగాచార్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రామచంద్రాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులకు సూచించారు. గ్రామాల్లో కార్డెన్ సెర్చ్, పోలీసు కవాతు, నాకాబందీ నిర్వహించి హింసాత్మక ఘటనలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ గురుశేఖర్, చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది సురేష్, రమణయ్య, మదన్‌మోహన్, త్యాగరాజులు, అబ్రహం, దివ్య పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబ సభ్యులకు చేయూతనిచ్చేందుకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం ఆర్థిక ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ బాబు సతీమణి మహేశ్వరికి రూ.1,75,000/-లు, హోంగార్డ్ మోహన్ సతీమణి కవితకు రూ.20,000/-లకు చెక్కులను అందజేశారు. శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తుండి అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1,75,000/-లకు చెక్కులను ఆయన సతీమణి మహేశ్వరికి అందజేసారు. టీటీడీ విజిలెన్సులో విధులు నిర్వహిస్తూ ఉండి అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎం.మోహన్ కుటుంబ సభ్యులకు రూ.20,000 లకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) సూపరింటెండెంట్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలకు లోబడే బిల్లుల చెల్లింపు

- తుడా వీసీ వెంకటనారాయణ

తిరుపతి తుడా: తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్నికల నిబంధనలకు లోబడే చెల్లింపులు చేపట్టామని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ పేర్కొన్నారు. తుడాలో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుపై తుడా అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారుల సూచనలు, ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే బిల్లులు చెల్లిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల కోడ్‌కు ముందు 2022–23 ఏడాదిలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకొని పనులు ప్రారంభించినవి, పూర్తిచేసున్న అభివృద్ధి పనులకు మాత్రమే బిల్లుల చెల్లింపులు చేపట్టామన్నారు. తుడకు సమకూరుతున్న నిధులకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఇందులో ఎక్కడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించలేదని ఆయన స్పష్టంచేశారు. కోడ్ వచ్చిన తర్వాత కొత్త పనులు ఆహ్వానించినా, ప్రారంభించినా అలాంటి వాటికి ఎన్నికల నిబంధనలు వర్తిస్తాయని ఆయన చెప్పారు. ఈ క్రమంలో ఎంపీడీవోల ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రీనరీ, మహిళా భవనాలు వంటి పనులకు సంబంధించి చిన్న కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లిస్తున్న బిల్లులు వివరాలను ఆయన పూర్తి డేటాతో విలేకరులకు అందజేశారు. టెండర్ తేదీ, పనులు ప్రారంభించిన తేదీ, వాటి పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించి తేదీలను కూలంకుషంగా ఆధారాలతో సహా ఆయన వివరాలు అందజేశారు.